ఎయు విసిగా ప్రసాదరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి శనివారం ఉదయం వీసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో సారి ఆయనను వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎయు పరిపాలనా భవనం వద్ద రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మొక్కను అందించి ప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలికారు.

అనంతరం వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు, ఆచార్యుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. అనంతరం ప్రసాద్‌రెడ్డి ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్‌లతో కలిసి పుష్పాంజలి అర్పించారు. అనంతరం కార్యాయలంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించగలమని ఎయు రుజువు చేసిందన్నారు. 2025-26లో వర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు.

అంగన్‌వాడీలకు విశాల మద్దతు

అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

-ఎక్కడికక్కడ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకోలు, ప్రదర్శనలు

-సమస్యలను పరిష్కరించాల్సిందేనని డిమాండ్

పాడేరులో ర్యాలీ చేపడుతున్న సిఐటియు నేతలు, అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు సమ్మెను శనివారం కొనసాగించారు. జిల్లాల్లోని పలు మండలాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకోలు, ర్యాలీలు చేపట్టారు.

పాడేరు: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా మెయిన్ రోడ్‌లో ప్రజా సంఘాలతో కలిసి శనివారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు రాస్తారోకో నిర్వహించారు. సమ్మెలో భాగంగా 40 వ రోజు అంగన్వాడిలు నిరవధిక దీక్షను కొనసాగించారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, అంగన్వాడీల పోరాటాన్ని పెడచెవిన పెడుతున్న ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. 45 రోజుల నుంచి అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని విమర్శించారు. దీక్ష శిబిరం వద్ద అంగన్‌వాడి కార్యకర్త సౌభాగ్యవతి మృతికి అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు సంతాపం తెలిపారు. ముంచంగి పుట్టు మండలం దారెల పంచాయతీలో అంగన్వాడి వర్కర్‌గా పనిచేస్తున్న పాంగి సౌభాగ్యవతి అనారోగ్యంతో విశాఖపట్నం కెజిహెచ్ లో మృతి చెందారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల అంగన్వాడీ వర్కర్లు సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సుందరరావు పాల్గొన్నారు .

రంపచోడవరంలో రాస్తారోకో చేపడుతున్న అంగన్‌వాడీలు

అరకులోయ :అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పట్టు విడవకుండా పోరాడితేనే న్యాయపరమైన డిమాండ్లు పరిష్కారం అవుతాయని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. అరకులోయలోని అంగన్వాడీల దీక్ష శిబిరంలో ఆయన పాల్గొని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు అంగన్వాడి యూనియన్ ప్రతినిధులతో కలిసి దీక్ష శిబిరంలో అంగన్వాడి కార్యకర్త మృతి పట్ల నివాళులు అర్పించారు.40 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా కనీసం జగన్మోహన్ రెడ్డికి మహిళలనే కనికరం లేకపోవడం విచారకరమన్నారు. పోరాడితే తప్ప కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే పరిస్థితిలో లేదన్నారు.జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు.

అరకులోయలో కార్యకర్తకు నివాళి అర్పిస్తున్న సురేంద్ర, ఉమా

పెదబయలు:మండల కేంద్రంలో అంగన్వాడి వర్కర్లు సమ్మెను కొనసాగించారు. సిఐటియు అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కారం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు.అంగనవాడి వర్కర్లు, ఆయాలు మానసిక శోభకు గురై మనోధైర్యం కోల్పోయి రాష్ట్రంలో అనేక చోట్ల అనేకమంది మృతి చెందుతున్నారని తెలిపారు.మృతి చెందిన అంగన్వాడి వర్కర్లకు రూ.25 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే స్పందించి అంగనవాడి వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మానపడాల్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు టి రాజమ్మ, కొండమ్మ, పద్మ, మంగమ్మ, కాసులమ్మ భాగ్య, సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండలంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. అంగన్‌వాడీ కార్యకర్త చిత్రపటానికి నివాళులు అర్పించి మౌనం పాటించారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి కే.శంకర్‌రావు, సత్యవతి మాట్లాడుతూ, అంగన్వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం, షోకస్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి భీమరాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కాంతమ్మ, దేవి, చిలకమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని దారెల పంచాయతీ సమ్మె శిబిరాన్ని సీపీఎం జెడ్పీటీసీ దీసరి గంగరాజు, సిఐటియు మండల కార్యదర్శి కె.మొస్య పరామర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్త చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కనీస వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు పి. మంజుల, కె.లక్ష్మి, సుమిత్ర పాల్గొన్నారు

హుకుంపేట:మండలం కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి టీచర్ల సమ్మె శనివారం 40వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం అందించిన నోటీసులకు భయపడేది లేదని అంగన్వాడి యూనియన్ నేతలు అప్పలకొండమ్మ, కృష్ణవేణి తెలిపారు. సమస్యలు పరిష్కరించాలంటూ వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పద్మ, కుమారి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు మద్దతుగా ప్రజా సంఘాల రాస్తారోకో

రాజవొమ్మంగి:అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించి వారి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేస్తూ, అంగన్వాడీల పోరాటానికి మద్దతుగా శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యాన అంగన్వాడీలు రాజవొమ్మంగి అల్లూరి జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు మాట్లాడుతూ 40 రోజుల నుంచి అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బాబురావు, అంగన్వాడి యూనియన్ నాయకులు సిహెచ్ కుమారి, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

రంపచోడవరం : 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యాన రంపచోడవరం అంబేద్కర్ సెంటర్లో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్, విఒఎల యూనియన్ నాయకులు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

40వ రోజుకు అంగన్వాడీ దీక్షలు

విఆర్.పురం : మండలంలోని రేకపల్లి జంక్షన్ వద్ద అంగన్వాడీల దీక్షా శిబిరంలో 40వ రోజు నిరాహార దీక్షలను ఎంపీపీ కారం లక్ష్మి ప్రారంభించారు. ఈ దీక్షలకు సంఘీభావం తెలిపిన సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ చట్ట ప్రకారమే సమ్మె నోటిస్ ఇచ్చి సమ్మె చేస్తున్నారని, అలాంటప్పుడు అంగన్వాడీలను ఏ విధంగా తొలగిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వడ్లాది రమేష్, సత్యనారాయణ, లక్ష్మణరావు, మనబడి వర్కర్స్ యూనియన్ నాయకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చింతూరు : మండల కేంద్రంలో 40వ రోజు అంగన్వాడీ దీక్షలను సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బెదిరింపులు, ఒత్తిళ్లకు గురై మృతి చెందిన అంగన్వాడీలకు సంతాప సూచికంగా దీక్షా శిబిరంలో అంగన్వాడీలు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ సభ్యులు భద్రమ్మ, కనకదుర్గ, జ్యోతి, చిట్టమ్మ, లలిత, సత్యవతి, దుర్గ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో అంగన్వాడీలు తలపెట్టిన సమ్మె 40వ రోజు కొనసాగింది. సమ్మె సందర్భంగా ప్రభుత్వ ఒత్తిళ్లకు గురై మృతి చెందిన అంగన్వాడీల చిత్ర పటాలలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎల్.సత్యవతి, అప్పలనరసమ్మ, జి. దయ వెంకటి, సిఐటియు జిల్లా కార్యదర్శి గిడుతూరి సత్యనారాయణ, అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

కొయ్యూరు : అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు మండలం దారెలా పంచాయతీ చెందిన అంగన్వాడీ కార్యకర్త పాంగి సౌభాగ్యవతి మృతికి సంతాప సూచికంగా మండలం కేంద్రంలో దీక్షా శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంగనవాడీ దీక్ష శిబిరానికి ఐసిడిఎస్ సిడిపిఓ వచ్చి వెంటనే విధుల్లో చేరకపోతే సోమవారం నుంచి కొత్త రిక్రూట్మెంట్ తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయమై అంగనవాడి నాయకురాలు అచ్చమ్మ, ముత్యాలమ్మ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించే వరకు విధుల్లో చేరేది లేదని తేల్చి చెప్పారు.

రాజ ఒమ్మంగిలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

సమావేశంలో పాల్గొన్న సబ్ కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

త్వరలో ఓటర్ల జాబితా ప్రకటన

- సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గం ఓటర్ల జాబితా త్వరలో ప్రకటించడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం తన ఛాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల సవరణ, ఓటర్ల మార్పులు చేర్పులపై సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుండి 19వ తేదీ వరకు ఫారం-6కు 53, ఫారం-7కు 4, ఫారం-8కు 52 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఏజెన్సీలో డోర్ నెంబర్ లేని వాటిని చాలావరకు పరిష్కరించడం జరిగిందన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించే విధంగా కొన్ని ఈవీఎంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో డబల్ ఎంట్రీ ఉన్నవాటిని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి సంబంధిత ఓటర్‌దారునికి నోటీసులు అందజేసి ఒక ఓటును తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 399 ఎన్నికల పోలింగ్ బూతులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ఒక బిఎల్‌ఓను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్లకు సంబంధించిన మార్పులు చేర్పులు, చనిపోయిన ఓటర్లు తొలగించడంలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను సబ్ కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు చుక్క సంతోష్ కుమార్, పి.శ్రీనివాసరావు, చోళ బొజ్జిరెడ్డి, యం.వాణిశ్రీ, పి.కృష్ణారెడ్డి, తహశీల్దారు పివిజె కుమార్, డిప్యూటీ తహశీల్దారు యంవివి సత్యనారాయణ, డి.ఇందిరాబాయ్, టి.లక్ష్మణ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పనుల కోసం వలస వెళ్లిన కూలీ మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు

వెంకటస్వామి (ఫైల్)

కూలి పనుల కోసం నంద్యాల జిల్లాకు వలస వెళ్లిన కొయ్యూరు మండలం అంతాడ పంచాయతీ పరిధి మునసల గ్రామానికి చెందిన పొట్టుకూరి వెంకటస్వామి అక్కడ మృతి చెందారు. నంద్యాల జిల్లాలో ఇటుక బట్టీల్లో కూలి పనుల కోసం కొయ్యూరు మండలం నుండి పొట్టుకూరి వెంకటస్వామితో పాటు మరికొంత మంది వెళ్లారు. వెంకటస్వామి డిసెంబర్ 2 నుండి కనిపించలేదు. ఊరు వెళ్లిపోయారేమోనని అక్కడి వారు అనుకున్నారు. అయితే నంద్యాల జిల్లా నందికొట్టుకూరు బస్ స్టేషన్‌లో వెంకటస్వామి మృతి చెందగా, జనవరి 9వ తేదీన పోలీసులు కేసు నమోదు చేసి, మృతుని వివరాలు వెల్లడించారు. దీంతో నందికొట్టుకూరులో కూలి పనులు చేస్తున్న కొయ్యూరు మండల వాసులు వెంకటస్వామి మృతి చెందిన విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంకటస్వామి కుమారుడు పొట్టుకూరి వెంకీనానాజీ, మేస్త్రి దేముడు, మరికొంత మంది నంద్యాల వెళ్లి మృతదేహాన్ని కొయ్యూరు తీసుకొచ్చారు. కూలి పనుల కోసం వెళ్లి వెంకటస్వామి మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వెంకటస్వామి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

జగన్ హయాంలో గిరిజనులకు తీరని అన్యాయం

★ **అరకులో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు**

★ **రా.. కదలిరా సభకు తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు**

ప్రజాశక్తి - డుంబ్రిగుడ

జగన్ హయాంలో గిరిజనులకు అంతటా అన్యాయమే జరిగిందని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. మండలంలోని అరకులో శనివారం టిడిపి రా కదలిరా సభ జరిగింది. దీనికి జిల్లా నలుమూలల నుంచీ టిడిపి కార్యకర్తలు తరలివచ్చారు. వారినుద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ జిఒ 3 రద్దయినా జగన్ నోరుమెదపలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే గిరిజన నిరుద్యోగ యువతకు వంద శాతం ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వ కాలంలో గిరిజనుల కోసం పెట్టిన సంక్షేమ పథకాలను వైసిపి అధికారంలోకి వచ్చాక రద్దు చేశారన్నారు. ఏజెన్సీలోని బాక్సైట్‌ను గుట్టుచప్పుడు కాకుండా దోచుకెళ్లిపోతున్నారని విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తాము అధికారంలోకొస్తే ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు, చిత్రంలో దొన్నుదొర

పోలవరం నిర్వాసితులను ఆదుకుంటామన్నారు. లేటరైట్ మైనింగ్‌తో ఏజెన్సీని వైసిపి మరో కెజిఎఫ్‌లా మార్చేసిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను వివరించారు. అన్ని స్థానాల్లోనూ వైసిపి ఓటమి ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి తప్పక విజయం సాధిస్తుందన్నారు.

బహిరంగ సభకు హాజరైన ప్రజలు

టిడిపి అరకు అభ్యర్థిగా దొన్నుదొర

టిడిపి అరకు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దొన్నుదొరను నియమించినట్లు సభా వేదికపై చంద్రబాబు ప్రకటించారు. ఆయన గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అయితే, సభ జరుగుతున్న సమయంలో సివేరి అబ్రహంకు సీటు కేటాయించాలని కోరుతూ ఆయన అనుచరులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. అంతటితో ఆగక దొన్నుదొర ఫ్లెక్సీలను సైతం చించివేశారు.

పలువురు టిడిపిలో చేరిక

వైసిపికి చెందిన 15 మంది సర్పంచులు, ఇద్దరు ఎంపిటిసిలు టిడిపిలో చేరడంతో వారికి చంద్రబాబు పార్టీ కండువాలను కప్పి సాదరంగా స్వాగతించారు. సభ ప్రారంభానికి ముందు బాబుకు ఘన స్వాగతం లభించింది. థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మాజీ మంత్రి మణికుమారి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం, జనసేన పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు గంగులయ్య, నియోజకవర్గం ఇన్‌ఛార్జి చిరంజీవి, ఫుడ్ కమిషన్ మాజీ సభ్యుడు ఎల్‌బి.వెంకటరావు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలివ్వాలి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు వాణిశ్రీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులు మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం యూనియన్ మండల విస్తృత స్థాయి సమావేశం కోర లాలీబాయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు కల్పించాలని, జీతంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై ఫిబ్రవరి 8న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కొమరం చెల్లాయమ్మ, ఉపాధ్యక్షులు సవిర్ల వెంకటలక్ష్మి, పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర నాయకులు వాణిశ్రీ

బీమా సౌకర్యం వల్ల ఎంతో మేలు

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని అన్నారు. మండలంలోని రేఖపల్లి పంచాయతీలో కె.వీరబాబు ఇటీవల మృతి చెందగా, ప్రాథమిక ఖర్చులకు వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10వేలు నగదును సర్పంచ్ సరోజిని చేతుల మీదుగా శనివారం వీరబాబు కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు ఎన్.భారతి, ఎన్.ప్రకాష్, వైసిపి నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు చిక్కాల బాలకృష్ణ, సీనియర్ నాయకులు మామిడి రాజు, సచివాలయ సిబ్బంది బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

బీమా డబ్బులు అందజేస్తున్న సర్పంచ్ సరోజినీ, సిపిఎం, వైసిపి నాయకులు

గిరిజన ఎమ్మెల్యేలపై చంద్రబాబు అసత్య ఆరోపణలు

- అరకు శాసనసభ్యులు చెట్టి ఫాల్గుణ

ప్రజాశక్తి- అరకులోయ :గిరిజన ఎమ్మెల్యేలపై తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అసత్య ఆరోపణలు చేయడం తగదని వైఎస్ఆర్సిపి అల్లూరి జిల్లా అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు వైసీపీ ప్రభుత్వం పై విమర్శించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్లో విలేకరులతో మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు అరకులో జరిగిన బహిరంగ సభలో వైసీపీ ప్రభుత్వం పై విమర్శలు గుప్పించడమే కాకుండా, గిరిజన ఎమ్మెల్యేల పైన కూడా లేనిపోని ఆరోపణలు చేయడం గిరిజనుల పట్ల చంద్రబాబుకి న్న మమకారం ఎంత ఉందో తెలుస్తుందన్నారు. తమపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని లేనిపక్షంలో చంద్రబాబు ఆ విధంగా చేస్తారా అని ఆయన సవాల్ చేశారు. గిరిజన ప్రాంతంలో అభివృద్ధి జరగలేదని ఆరోపించిన చంద్రబాబు పాడేరులో మెడికల్ కళాశాల, గిరిజన యూనివర్సిటీ, నాడు నేడు పనులు చేపట్టింది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు.ఏజెన్సీలో 200 సెల్ టవర్లు, 98 సచివాలయాలు ఏర్పాటు చేయడం, 96 ఆర్ బి కే సెంటర్లు నిర్మించి గిరిజనులకు సేవలందిస్తున్నది అభివృద్ధి కాదా అని ఆయన ప్రశ్నించారు. అరకు నియోజకవర్గ పరిధిలో 600 కోట్ల రూపాయలతో 317 రోడ్లు నిర్మాణం చేపట్టింది చంద్రబాబుకు కనిపించ లేదా అని ఆయన ప్రశ్నించారు.గిరిజనుల కోసం ఏమాత్రం పట్టించుకోని చంద్రబాబు నాయుడు ఇప్పుడు విమర్శలు గుప్పించడంలో అర్థం లేదన్నారు.గిరిజన ఎమ్మెల్యేలపై, వైసిపి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తే తెలుగుదేశం పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదన్న విషయం చంద్రబాబు నాయుడు గమనించాలన్నారు. అరకులో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు గిరిజన ప్రజానీకం నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మళ్లీ వైసీపీ నే మన్యం ప్రజలు ఆదరిస్తారని ఆయన స్పష్టం చేశారు.

నేడు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- అనంతగిరి:అనంతగిరిలో ఈ నెల 21న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని సిపిఎం సర్పంచ్ సోమ్మేల రూతు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ, స్థానిక సచివాలయంలో విజయనగరం తిరుమల ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. బిపి, జిఆర్, బిఎస్, ఈసీజీ, కార్డిలయాజి, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వంటి వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మారుమూల గ్రామాల రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కంపా హనూక్

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

ప్రజాశక్తి-సీతమ్మధార : మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని జివిఎంసి 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనూక్ అన్నారు. 45వ వార్డు కమ్యూనిటీ హాల్‌లో శనివారం మహిళలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల 23వ తేదీన నాలుగో విడత డ్వాక్రా రుణమాఫీని మహిళలకు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరి పట్నాయక్ నాయుడు, మహిళలు పాల్గొన్నారు

గైనకాలజిస్ట్ పోస్ట్‌ను రెన్యువల్ చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ:అరకులలోని 150 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో గైనికాలజిస్ట్ కాంట్రాక్టు పోస్టు గడువును పొడిగించాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శనివారం స్థానిక 150 పడకల హాస్పిటల్‌ని సందర్శించిన ఆయన గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరలతో మాట్లాడుతూ, ఈ నెలాఖరుతో హాస్పిటల్లో సేవలు అందుతున్న గైనకాలజిస్టు కాంట్రాక్ట్ ముగుస్తుందని, పోస్టు గడువు పొడిగించి ఆదివాసీ గర్భిణీ, బాలింతలకు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. అరకు ఏరియా ఆసుపత్రిలో నెలకు 120 పైగా గర్భిణీలు ప్రసవ సేవలు పొందుతున్నారని, నెలకు కనీసం 15 మంది వరకు సిజరింగ్ అయ్యి ప్రసవం పొందుతున్నారని ఆయన అన్నారు. నెలకు సుమారు 400 మందికి పైగా గర్భిణులు పరీక్షలు చేయించుకుంటున్నారని, ఇలాంటి కీలకమైన గైనకాలజిస్తు పోస్టు ఈనెల చివరిలో ముగుస్తున్న ందున, ఇక్కడ ఆరోగ్య సేవలు పొందుతున్న గర్భిణులు, బాలింతలు తీవ్రమైన ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు.

ఆస్పుపత్రిలో గర్భిణీలు, బాలింతలతో మాట్లాడుతున్న సురేంద్ర

ఈ విషయాలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని దివాసీ మహిళలు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సేవల మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.రామారావు, కె.బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టిడబ్ల్యూటియు రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం (టిడబ్ల్యూటియు) రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ అధికారులకు విన్నవించారు. శనివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠం అధ్యక్షతన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను చర్చించారు. జిల్లాలోని రంపచోడవరం ఐటిడిఎ పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తున్నా..పాడేరు ఐటిడిఎ పరిధిలో ఉపాధ్యాయ పదోన్నతులకు మాత్రం కోర్టు కేసులు ఉందంటూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకుండా కోర్టు కేసుల నెపంతో కాలయాపన చేస్తూ ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడేరు ఐటిడిఎ అధికారులు ఆశ్రమ పాఠశాలల్లోని ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం ఖాళీలను సీనియార్టీ ప్రాతిపదికన అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్స్ కు పదోన్నతులు కల్పించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ ఆరోపణలపై సస్పెండ్, సరెండర్ చేసిన ఉపాధ్యాయును తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు టి.లింగమూర్తి, భీమరాజు, శోభన్ బాబు, మోహన్ బాబు, జయకృష్ణ, చిన్న, సింహాచలం, శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పాడేరు: మన్య ప్రజల ఆరాధ్య దేవత మోద కొండమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన బంగారు కానుకలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బంగారు కిరీటం తయారు చేశారు. అమ్మవారికి ఈ బంగారు కిరీటం అలంకరణ ఉత్సవం శనివారం సాయంత్రం ఆలయంలో ఘనంగా నిర్వహించారు . స్థానిక ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ ఆలయ కమిటీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగ్‌రావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు దంపతులు అమ్మవారికి ఈ బంగారు కిరీటం అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి గజమాలలతో పట్టుచీరతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయ కమిటీ తరపున ముద్రించిన వార్షిక క్యాలెండర్ ను పిఒ, ఎమ్మెల్యే ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అల్లూరి సత్యనారాయణరాజు నవల హిందీ అనువాదాన్ని ఆవిష్కరిస్తున్న శర్మ తదితరులు

సాహిత్య సేవకుడు అజీజ్

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ చారిత్రిక నవలా రచయిత ఎస్‌డివి అజీజ్ సాహిత్య సేవకుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. అజీజ్ తెలుగులో రాసిన అల్లూరి సత్యనారాయణరాజు (ఓ స్వాతంత్ర్య సమరయోధుడు 1913–1963) జీవితగాథను పారనంది నిర్మల హిందీలో అనువదించిన నవలను శనివారం స్థానిక పౌర గ్రంథాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ఆవిష్కరించారు. అరసం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ, రచయిత అజీజ్ అల్లూరి జీవిత విశేషాలతో పాటు ఆనాటి సామాజిక పరిస్థితులను, స్వాతంత్ర్య ఉద్యమం నాటి సంఘటనలను నేటి తరం వారికి దగ్గరగా రచన చేయడం గొప్ప శుభపరిణామం అన్నారు. నేటి తరం యువత ఇలాంటి నవలను చదవాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సత్యనారాయణరాజు సలిపిన పోరాట పటిమ కళ్లకు కట్టినట్టు అజీజ్ రాశారని తెలిపారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది అల్లూరి సీతారామరాజు, ఏపీ క్షత్రియ ఫెడరేషన్ అధ్యక్షుడు చెరుకూరి వెంకటపతిరాజు, రచయిత ఎస్‌డివి అజీజ్, విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు బి.రాధారాణి, రచయితలు కెజి.వేణు, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, శ్యాంసుందర్, రాజు, బొట్ట అప్పారావు, బసుపోతన తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

'అంబేద్కర్ ఆశయ సాధనతో పాలన'

ప్రజాశక్తి-సీతమ్మధార : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత తెలిపారు. నరసింహనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందేలా ముఖ్యమంత్రి కృషిచేస్తున్నారన్నారు. యాత కులస్తులందరూ జగన్మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, ప్రతినిధులు ఈశ్వరరావు, మంగరాజు, గోవిందు, శ్రీనివాస్, పిల్లి సంతోష్, కన్నారావు, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వీసీకి కెకె.రాజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా మరొకసారి నియమితులైన ఆచార్య పివిజిడి ప్రసాద్‌రెడ్డిని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి యూత్ అధ్యక్షులు ఆళ్ల శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ విడుదల

ప్రజాశక్తి-సీతమ్మధార : మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగ అప్పారావు, టివివి సత్యనారాయణ, ఎన్.బాబి, వి.నారాయణరావు, నాగభూషణం పాల్గొన్నారు.

జమాల్‌ఖాన్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఆయుర్వేదంతో మొండి రోగాలు నయం

ప్రజాశక్తి - చింతూరు : ఆయుర్వేదంతో మొండి రోగాలను కూడా నయం చేసుకోవచ్చని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం, వరంగల్ జిల్లా, హనుమకొండ మండలం, చింతగట్టు గ్రామంలో మహర్షి గోశాల వద్ద ఔషధ మొక్కల అవగాహన కార్యక్రమం ఎస్సార్ఎం ఫౌండేషన్ సహకారంతో, మహర్షి గోశాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జమాల్‌ఖాన్ మాట్లాడుతూ నేడు విచ్చలవిడిగా ఇంగ్లీషు మందులను వాడటంతో రోగాలు తాత్కాలికంగా నయం అయినా, మందుల దుష్పరిణామాలు చూపుతున్నాయని చెప్పారు. సాధ్యమైనంతవరకు వంటింటి చిట్కాలు వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అయితే వనమూలికా వైద్యంలో శాస్త్రీయత లేకుండా ఇష్టం వచ్చినట్లు మూలికలను వాడకూడదని, అలా వాడితే వ్యాధి నయం కాకుండా వేరే విధంగా వికటించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అతిమధురం అనే మూలిక అన్ని రకాల మూలిక వైద్యంలో మిశ్రమించి వాడితే అమృతంలా పనిచేస్తుందని చెప్పారు. జలుబు, దగ్గు, వంటి నొప్పులు, తలనొప్పి, కడుపునొప్పి వంటి చిన్న సమస్యలకు పెద్ద మోతాదులో అల్లోపతి మందులు వాడటంతో ఆరోగ్యంపై వాటి ప్రభావం ఉంటుందని తెలిపారు. మన పూర్వీకులు వంటింట్లో వాడే దినుసులు ద్వారానే తగ్గించుకున్నారని గుర్తు చేశారు. అనంతరం జమాల్ ఖాన్‌ను సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ డిఎఫ్ఒ ఎస్.సుజాత, రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్.ఉమారెడ్డి, ఉద్యానవన అధికారి, పారంపర్య వైద్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సజ్జల రమేష్, వనమూలిక వైద్యులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో

మహిళలకు అన్ని విధాలా అండగా నిలవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పని ప్రదేశాల్లో మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని, ఆహ్లాదకర, స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. మహిళలను కుటుంబ సభ్యుల్లా చూసుకోవాలని, వారి హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనే భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదని హితవు పలికారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం - 2013పై స్థానిక జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ఆయన మాట్లాడుతూ చట్టం తాలూక ఉద్దేశాలను, మహిళలకు కల్పించిన రక్షణ చర్యలను వివరించారు. చట్టం గురించి అధికారులందరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని, పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఆయా కార్యాలయాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలపై వేధింపుల నిరోధక చట్టం గురించి విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. మాటల ద్వారాగానీ, చేష్టల ద్వారాగానీ, ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ మహిళలపై వేధింపు చర్యలకు పాల్పడరాదని, అలాంటి సంఘటనలు జరిగినప్పుడు జిల్లా అధికారులు చట్టంలో పేర్కొన్న నిబంధనలను, నియమావళిని పాటించాలని సూచించారు. ఈ క్రమంలో ఆయనతో పాటు కార్యక్రమంలో భాగస్వామ్యమైన పలువురు న్యాయ నిపుణులు పలు అంశాలపై వారి అభిప్రాయాలను, అనుభవాలను సదస్సులో పంచుకున్నారు. కార్యక్రమంలో విశాఖపట్టణం మెట్రో పాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, విశాఖపట్టణం కోర్టు రెండో అదనపు జడ్జి ఎం.వెంకటరమణ, ఇతర అదనపు న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవి.శేషమ్మ, ఇతర సీనియర్ సివిల్ జడ్జిలు, పలువురు మెజిస్ట్రేట్లు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, ప్రయివేటు సంస్థల ప్రతినిధులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఖాళీ అవుతోందా ?

విశాఖ దక్షిణంలో వాసుపల్లితో మిగిలింది ఒక్క కార్పొరేటరే

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని వైసిపి నాయకత్వ తీరుపై సొంత పార్టీ వారే అసమ్మతితో రగిలిపోతున్నారు. పలు తరగతులకు చెందిన ప్రజల్లో వైసిపి పాలనపై కనిపించే వ్యతిరేకత ఒక ఎత్తయితే స్థానిక నాయకత్వ తీరుతో ముఖ్య నాయకులు, ఆ పార్టీ జెండాను ఏళ్లతరబడి భుజాన ఎత్తుకున్న వారు సైతం నెమ్మదిగా వైసిపిని వీడుతుండడం తాజా పరిణామం. అసలు విశాఖ నగరానికి బలమంతా కార్పొరేటర్లే. 98 వార్డుల్లో 58 వరకూ వైసిపి చేతిలోనే ఉన్నాయి. 2019 ఎన్నికల్లో విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తరం, దక్షిణం స్థానాలు నాలుగూ టిడిపి గెలిచినవే. దీంట్లో దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వైసిపి తీర్థం పుచ్చుకున్నప్పటికీ మూడు ఇప్పటికీ టిడిపి ఖాతాలోనే ఉన్నాయి. కార్పొరేటర్ల ఎన్నికలకు వచ్చేసరికి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు భిన్నంగా అధిక స్థానాలు వైసిపికి దక్కాయి. 2024 అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ మరలా పాత పరిణామాలే పునరావృత్తమవుతున్నాయి. అందులో అసమ్మతి తీవ్రరూపం దాల్చిన అసెంబ్లీ సెగ్మెంట్ ఏదైనా ఉందంటే వాసుపల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న దక్షిణ నియోజకవర్గమేనని చెప్పొచ్చు.

వార్డుల్లో సమావేశాలకు నేతలు కరువాయె !

దక్షిణం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోగల వైసిపి కార్పొరేటర్లంతా వాసుపల్లిపై తిరుగుబావుటా ఎగరవేయడంతో దాదాపు ఈ నియోజకవర్గంలో వైసిపి ఖాళీ అవుతోందా ? అన్న వాతావరణం ఏర్పడింది. శనివారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దక్షిణంలో నిర్వహించిన ఒక సమావేశంలో 10 మంది కార్పొరేటర్లకుగానూ ఒక్కరంటే ఒక్కరే హాజరుకావడంతో ఆయనకు మొహం మొత్తేసినట్టయింది. ఈ పరిస్థితిని ముందే ఊహించిన ఆయన పక్క చోట్ల నుంచి నాయకులు, కార్యకర్తలను తెచ్చుకున్నారు. 'రాకపోతే ఏం చేస్తాం. పక్కనుంచైనా తెచ్చుకోవాలి' కదా ! అన్న రీతిలో ఆయన ఈ సందర్భంగా ప్రసంగించిన వీడియో కూడా నగరంలో వైరల్ అయ్యింది.

29వ వార్డు ఉరుకూటి నారాయణరావు, 30వ వార్డు కోడూరి అప్పలరత్నం, 31వ వార్డు బిపిన్ జైన్, 32వ వార్డు కందుల నాగరాజు, 35వ వార్డు విల్లూరి భాస్కరరావు, 36వ వార్డు మాసిపోగు మేరీజోన్స్, 37 వార్డు చెన్న జానకిరామ్, 39వ వార్డు సాధిక్, 41వ వార్డు కోడిగుడ్ల పూర్ణిమ, 42వ వార్డు లీలావతి గతంలో కార్పొరేటర్లుగా ఆయా చోట్ల నుంచి గెలుపొందారు. వీరిలో కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచి అనంతర కాలంలో వైసిపిలో చేరారు. అక్కడ వాసుపల్లితో విభేదించి ఇద్దరు జనసేనలోకి వెళ్లారు. మరికొందరు అధికార పార్టీకి దూరం జరిగారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రాజకీయ అనిశ్చితిని అధిష్టానం ఎలా చక్కదిద్దుతుందో ? అని వైసిపి శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

రెల్లి కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్న రెల్లి కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరుతూ శనివారం రెల్లిహక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ రెల్లి కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెన్నా తిరుమలరావు, సింగంపల్లి కళ్యాణ్, చెన్నా వెంకట్రావు, కస్తూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. రెల్లి హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆడమ్స్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

స్ఫూర్తిదాయకం.. అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

నిరాటంకంగా 40 రోజులుగా అంగన్‌వాడీలు స్ఫూర్తిదాయకమైన సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధం, అణచివేత, బెదిరింపులు, హెచ్చరికలను లెక్కచేయకుండా, పండగ, పబ్బాలు వదిలి పోరాటం కొనసాగిస్తున్నారు. సమ్మెను నిషేధిస్తూ సర్కారు ఎస్మా చట్టం ప్రయోగించినా, షోకాజ్ నోటీసులు జారీ చేసినా వెనుదిరగకుండా ముందుకు సాగుతున్నారు. వారికి శక్తివంతమైన కార్మికవర్గం బలముంది. ఎంతో మంది ప్రజాస్వామిక, ప్రజాతంత్రవాదుల అండదండలున్నాయి. అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేసి బలహీనపర్చాలని ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, ఒత్తిళ్లు తెస్తున్నా వీరి ఐక్యపోరాటం ముందు ఆ పాచికలేవీ పారలేదు. షోకాజ్ నోటీసుకు సామూహికంగా వెళ్లి ప్రాజెక్టు అధికారులకు సంజాయిషీ నోటీసు ఇచ్చి నిరసన తెలిపారు తప్ప భయపడలేదు. ప్రభుత్వమెన్ని మాయోపాయాలకు దిగినా అంగన్‌వాడీల సమ్మెకు వున్న ప్రజాస్వామిక, పోరాట బలం, పౌర సమాజం మద్దతు ముందు అవన్నీ తుడిచిపెట్టుకుపోతున్నాయి.

గ్రాట్యూటీ చెల్లించాలన్న సుప్రీంకోర్టు తీర్పు, తెలంగాణ రాష్ట్రంలో కంటే ఎక్కువ జీతం రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయాలని వారు అడగడంలో అన్యాయం ఏముంది ? 2017 నుంచి బకాయిపడ్డ టిఎ, డిఎలు చెల్లించాలనడంలో తప్పేముంది?. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పోషకాహారం మెనూ పెంచాలని కోరడంలో అసమంజసం ఎక్కడుంది ? వీరి డిమాండ్లు న్యాయమైనవి తప్ప, కోర్కెలెక్కడున్నవి ?.

ప్రయాణ ఖర్చులకు, ఖరీదైన భోజనాలకు ప్రజల సొమ్ము ఖర్చు పెడుతున్న పెద్దలకు, పేద కుటుంబాలకు పోషకాహారం అందిస్తున్న అంగన్‌వాడీల బాధలు, సమస్యలు పట్టడంలేదు. అందుకే రాజ ధర్మం మరిచి, విడిచి అప్రజాస్వామిక చర్యలకు ఈ ప్రభుత్వం పాల్పడుతోంది. అయినా అంగన్‌వాడీలు తమ పోరాట క్రమంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. అంగన్‌వాడీలే కాదు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రతినెలా ఒకటిన జీతాలు చెల్లించాలని, బకాయిలు జమ చేయాలని ఆందోళన చేస్తున్నారు.

కొద్ది రోజుల క్రితం విజయవాడలో తలపెట్టిన 36 గంటల ధర్నాకు వెళ్లకుండా యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలను నిస్సిగ్గుగా ఎక్కడికక్కడ నిర్బంధించే చర్యలకు దిగి ప్రజాస్వామిక విలువలను, హక్కులను ఈ ప్రభుత్వం అపహాస్యం చేసింది. డిసెంబరులో మిచౌంగ్ తుపానుకు పంట నష్టపోయిన రైతుకు నెలైనా పరిహారం చెల్లించలేదు. ప్రభుత్వం తన పొరపాట్లు, తప్పిదాలను సరిచేసుకొనే మార్గం అన్వేషించకుండా, అత్యంత మొరటు పద్ధతులకు పాల్పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం తన పంతంవీడి, అంగన్‌వాడీలు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. లేదంటే తన పతనానికి బలమైన పునాదులు ప్రభుత్వం వేసుకున్నట్లే.

పట్టుకున్న కోతులను బోనులో వేసి అటవీ ప్రాంతానికి తరలిస్తున్న సిబ్బంది

సురక్షిత ప్రాంతానికి కోతులు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న 500 కోతులను ప్రజల అభ్యర్థన మేరకు సర్పంచ్ మంగ బొజ్జయ్య ఆధ్వర్యంలో శనివారం పట్టి సురక్షిత ప్రాంతానికి తరలించారు. రంపచోడవరం గ్రామంలో కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను, వాహనదారులను, చిన్నపిల్లలను ఎన్నో విధాలుగా ఇబ్బంది పెడుతున్నాయి. దీంతో స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ బొజ్జయ్య చొరవ తీసుకొని సిబ్బందిని ఏర్పాటు చేసి కోతులను పట్టించి వాటిని సురక్షితంగా జనావాసాలకు దూరంగా అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఇప్పటి వరకు రంప రోడ్డు గంగాలమ్మ గుడి వీధి, సంత మార్కెట్ వీధుల్లో సుమారు 500 కోతులను పట్టించడం జరిగిందని, రంపచోడవరం గ్రామంలో స్పెషల్ డ్రైవ్ కింద మరో 20 రోజుల పాటు మిగిలిన వీధుల్లో ఉన్న అన్ని కోతులను పట్టించడం జరుగుతుందని సర్పంచ్ బొజ్జయ్య తెలిపారు.

రైతు కూలీ సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చింతూరు : ఈనెల 28వ తేదీన జరగనున్న అఖిల భారత రైతు కూలి సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 10వ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుంజా దూలయ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. దున్నేవానికే భూమి కావాలని, కొండపోడు సేద్యం ఆదివాసీ ప్రజల జన్మహక్కు అంటూ రైతు కూలీలు, పీడిత ప్రజల కోసం రైతు కూలి సంఘం ఉద్యమాలు చేస్తుందని పేర్కొన్నారు. రాజానగరంలోని శ్రీకాంద్రేగుల జోగి జగన్నాధరావు బహుదూర్ వారి అన్నదాన సత్రంలో జరుగు ఈ సంఘం మహాసభకు ప్రజాస్వామిక వాదులు, ఉద్యమ అభిమానులు, వ్యాపార వర్గాలు అన్ని విధాలుగా సహకారాలు అందించి విజయవంతం చేయటానికి తోడ్పడాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై జివిఎంసి కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దోమల వృద్ధిని అరికట్టడంపై, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాధుల నివారణపై ప్రత్యేక దష్టి సారించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ జివిఎంసి ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. శనివారం అయిన తన ఛాంబర్లో జివిఎంసి ప్రజారోగ్య అధికారులు, జిల్లా మలేరియా అధికారితో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు, దోమల వృద్ధిని అరికట్టుటకు చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు తప్పక పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు తమ వంతు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభంలో భాగంగా శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి హెల్మెట్ బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ క్రమంలో మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని, రహదారి భద్రతా నియమాలు పాటించాలని, తద్వారా ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. రవాణా శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ వడ్డి సుందర్ మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉప రవాణా కమిషనర్ రాజారత్నం మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలిగామని గుర్తు చేశారు.